క్లుప్తంగా

మహనీయుల జయంత్యుత్సవాలు నిర్వహించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ, ఎస్సీ కాలనీ వాసులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఈ నెల 11 నుంచి 14 వరకు బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతి రావు పూలే జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణ కోరారు. గురువారం మండలంలోని కామేపల్లి గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాసరావు, రావూరి రవిబాబు, ఆనందరావు, సతీష్, సునీత, మాధవి, కోమటి గుంట రాంబాబు, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

చీరాల అర్బన్: పట్టణంలోని ఉజిలిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది.

మార్టూరులో నేత్రదానం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరుకు చెందిన వ్యాపారవేత్త యక్కల ఆంజనేయులు (88) గురువారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు ఆయన కళ్ళను దానం చేశారు. గుంటూరులోని శంకర నేత్రాలయం వైద్యులకు అందజేశారు. ఆంజనేయులకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడున్నారు.

యద్దనపూడి ఏపీఓ బాధ్యతల స్వీకరణ

యద్దనపూడి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం యద్దనపూడి మండల ఏపీఓగా స్వర్ణ రేణుక గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో ఇంకొల్లు మండల ఏపీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీఓ రమేష్ బదిలీపై పర్చూరు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా వలసలను నివారించేందుకు ప్రతి ఒక్కరికీ పనికల్పించేలా చర్యలు చేపడతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు అందిస్తామని చెప్పారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం మృగశిర నక్షత్రం షష్టి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సమీపంలోని మాదల గ్రామానికి చెందిన సుమంత్ ద్విచక్ర వాహనంపై చిలుకలూరి పేట నుండి మార్టూరు సర్వీస్ రోడ్డులో వస్తున్నాడు. అదే మార్గంలో మార్టూరు నుంచి చిలుకలూరి పేట వైపు వెళ్తున్న ఆటో సుమంత్ బైకు ను ఢీ కొట్టింది. ప్రమాదంలో రోడ్డు పై పడి గాయ పడిన సుమంత్‌ని హైవే అంబులెన్సు సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కాలుష్యపురి



తక్కువ మైక్రాన్ల మందం ఉన్న పాలిథీన్ కవర్లు



పట్టణంలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తలో ఉన్న కవర్లు (ఫైల్)

- క్షీరపురిగా పేరుగాంచిన చీరాల్లో ప్లాస్టిక్ భూతం
- యథేచ్ఛగా పాలిథీన్ వినియోగం
- నామ మాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు
- ప్రశ్నార్థకంగా పర్యావరణం, ప్రజారోగ్యం

చీరాల: చినముంబైగా పేరుపొంది.. నిత్యం వ్యాపార లావాదేవీతో కళకళలాడే క్షీరపురి నేడు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ముఖ్యంగా పలు రకాల రూపాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోంది. ప్రతి వస్తువునూ ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇవ్వడం నిత్యకృత్యం అయింది. తక్కువ మైక్రాన్ల మందంతో ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని చెబుతున్నా ఎవరూ ఖాతరు చేయడంలేదు. పూలు, పండ్లే కాదు వేడి వేడి సాంబారు, టీ కూడా ప్లాస్టిక్ కవర్లలో పార్శిల్ చేస్తున్నారంటే ప్రజలు కూడా ఎంత అనాలోచితంగా ఉన్నారో అర్థం చేసుకోవాలి. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నా అక్రమ మార్గాల్లో ఆయా కవర్లు చీరాల పట్టణంలో డంప్ అవుతున్నాయి. రోడ్డు పక్కన.. డ్రైనేజీలో ఎక్కడ చూసినా వాడి పడేసిన పాలిథీన్ కవర్లే దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు అక్కడ నుంచి చీరాలకు చేరవేస్తున్నారు. వాటిని పట్టణంలోని ఏఆర్ రోడ్, ఎంజీసీ మార్కెట్ రోడ్, సంతబజారు, కూరగాయల మార్కెట్ ఇలా ప్రతి ప్రాంతంలో విక్రయిస్తున్నారు. కవర్లు కాలువల్లో పేరుకుపోయి మురుగునీటి పారుదలకు అడ్డంకిగా మారింది.

నిబంధనలు బేఖాతర్

పాలిథీన్ కవర్లు 40 మైక్రాన్లు కంటే తక్కువ ఉంటే వాటిని ప్రభుత్వం నిషేధించింది. ఈ ప్లాస్టిక్ కవర్లు గానీ, వస్తువులను గానీ ఎక్కడా విక్రయించకూడదు. కానీ మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎవరిష్టం వారిదిగా మారింది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్నవాటిని కిలో రూ.130 చొప్పున అమ్ముతున్నట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు నెలలో కొన్ని రోజులు తనిఖీల పేరుతో హడావిడి చేస్తుంటారు. తోపుడు బండ్లు వ్యాపారులు, కిరాణా షాపు యజమానులకు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ సమతుల్యత గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. వీధుల్లో తిరిగే ఆవులు కవర్లు తిని మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల రెండు ఆవులు మృతి చెందినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

తనిఖీలు చేపడుతున్నాం

పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధంలో ఉంది. అయినా తక్కువ మైక్రాన్ల మందం ఉన్న కవర్ల వినియోగం జరుగుతోంది. వీటిపై నిషేధం ఉన్నా వాటిని అమ్ముతున్న వారిపై తనిఖీలు చేస్తున్నాం. గుడ్డ సంచులు వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలి.

– అబ్దుల్ రషీద్, మున్సిపల్ కమిషనర్

రీసర్వేకు సహకరించండి



యద్దనపూడి: రీసర్వే ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ గ్లోరియా, రెవెన్యూ అధికారులు



కారంచేడు ర్యాలీలో తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది

యద్దనపూడి: సమగ్ర భూసర్వేలో భాగంగా ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చని బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా సూచించారు. గురువారం మండలంలోని పోలూరు, యనమదల గ్రామాల్లో జరిగిన రీసర్వే పై జరిగిన ర్యాలీకి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తహసీల్దారు కె. రవికుమార్, రీసర్వే డీటీ విష్ణుప్రసాద్, మండల సర్వేయర్ ఏ.సాంబశివరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: రీ సర్వేకు గ్రామ రైతులు సహకరించాలని, సర్వే జరిగే సమయంలో సంబంధిత రైతులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండల పరిధిలోని బూదవాడ, కొండమూరు గ్రామంలో రీ సర్వే నిర్వహించారు. సర్పంచ్ బండి శివకుమారి, డీడీ ఏ. శివశ్రీను, ఆర్ఐ శ్వేత పాల్గొన్నారు.

కారంచేడు: ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించేలా సిబ్బందిని అప్రమత్తం చేశామని తహసీల్దారు జి. నాగరాజు అన్నారు. గురువారం కారంచేడు రెవెన్యూ కార్యాలయం నుంచి కాలువ సెంటర్, బ్యాంక్ సెంటర్, చినవంతెన సెంటర్, పెద బజారుల మీదగా కల్యాణమండపం వరకు ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కారంచేడు, కొడవలివారిపాలెం గ్రామాల్లో రీ సర్వే ప్రారంభిస్తారన్నారు. డీటీ అనిత, మండల సర్వేయర్ సత్యన్నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బూదవాడలో రీ సర్వే ర్యాలీ

పర్చూరు (బుధవారం): నూతలపాడు గ్రామంలో భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం ర్యాలీ నిర్వహించారు. పర్చూరు తహసీల్దార్ పి. బ్రహ్మయ్య, డీటీ, సర్పంచ్ చిన్నయ్య, మండల సర్వేయర్, వీఆర్వోలు, రైతులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

చిన్నగంజాం: మండలంలోని చిన్నగంజాం, సంతరావూరు గ్రామాల్లో రీ సర్వే చేయనున్న దృష్ట్యా గురువారం ర్యాలీ నిర్వహించారు. సంబంధిత రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలని, సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా హాజరై, సదరు భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు.. సరిహద్దులను చూపించాలని కోరారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర్ రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: రైతులు రీ సర్వేకు సహకరించాలని తహసీల్దార్ రవి నాయక్ పిలుపునిచ్చారు. గురువారం కొప్పరపాలెం, గొర్రెపాడు గ్రామాల్లో ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. రీసర్వే డీటీ ప్రహర్ష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కొప్పరపాలెంలో రీసర్వేపై ర్యాలీ

వాహనాలు జాగ్రత్తగా నడపకుంటే ప్రమాదాలు



వ్యవసాయ కూలీలకు కౌన్సెలింగ్ చేస్తున్న అంకమరావు

కారంచేడు: ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టమొచ్చినట్లు అడ్డదిడ్డంగా నడపుతూ వారితో పాటు అనేక మందికి ప్రమాదకరంగా మారుతున్న వారిని అరికట్టాలని బాపట్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమరావు అన్నారు. గురువారం కారంచేడులో స్వర్ణ, కుంకలమర్రు, పర్చూరు, చీరాల వైపుల నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వ్యవసాయ కూలీలలో ఆటోలు పరిమితికి మించిన జనాభాలను ఎక్కించడం, పెద్ద పెద్ద లౌడ్ స్పీకర్లు పెట్టి మితిమీరిన వేగంతో ప్రయాణించడం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటో వాలాలు పరిమితికి మించి ఎక్కించడంతో పాటు, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తే చర్యలు తప్పవన్నారు. అవసరమైతే లైసెన్స్‌లు సైతం రద్దు చేస్తానని హెచ్చరించారు. యువత స్పీడ్ బైక్‌లపై హెల్మెట్‌లు కూడా లేకుండా ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారన్నారు. ద్విచక్రవాహనాలపై ఉండే ఇద్దరు తప్పకుండా హెల్మెట్‌లతో ప్రయాణించాలన్నారు. మూడు ఆటోలపై కేసులు నమోదు చేశారు.

విధుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న సీడీపీఓ

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, సహాయకులు విధులు, బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ డి. సుధ కోరారు. గురువారం బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని 134 మంది కార్యకర్తలు, సహాయకులతో సమావేశం నిర్వహించారు. బాల సంజీవిని యాప్‌లో కార్యకర్తలు, సహాయకుల హాజరు నమోదుతోపాటు చిన్నారులకు అందించే రేషన్ సరుకు నిల్వలను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. వేసవి ఎండల దృష్ట్యా కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్లు మీరాభి, సుష్మరాణి, ప్రమీల, విజయనిర్మల మాట్లాడారు.

ఘనంగా ఆలయ కలశ ప్రతిష్ఠ



మార్టూరు రామాలయంపై కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న పండితులు

మార్టూరు: మార్టూరు ఈశాన్య వీధిలోని రామాలయంపై గురువారం ఆలయ కలశ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వచనం, అనంతరం దాతల నేతృత్వంలో ఆలయ శిఖరంపై కలశాన్ని ప్రతిష్ఠింపజేశారు. తరువాత పూర్ణాహుతి సీతారాముల వారి శాంతి కల్యాణం జరిపించారు. ఈనెల 11వ తేదీ ఒంటిమిట్ట రామాలయంలో కళ్యాణం నిర్వహించే సందర్భంలో ఈ ఆలయంలో కూడా సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీరాముల వారి కల్యాణానికి ఏర్పాట్లు



రోటిలో పసుపు దంచి సిద్ధం చేస్తున్న ముత్తైదువులు

వేటపాలెం: అణుమల్లిపేటలోగల మహాలక్ష్మమ్మ మందిరం వద్ద శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముల వారి కళ్యాణానికి నాంది పలుకుతూ ముత్తైదువులు గురువారం పసుపు కొమ్ములు రోటిలో దంచారు. ఆధ్యాత్మిక పాటలు పాడారు. ప్రత్తి అనంతలక్ష్మి, కొలిశెట్టి అనసూయ, కోడూరి భారతి, కోటేశ్వరమ్మ, కోమలీదేవి, ధనలక్ష్మి, సుకన్య నాగరత్నం, రమాదేవి, రాధా రాజేశ్వరి, సత్యవతి, రమాదేవి తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగాలి



లైబ్రరీ పుస్తకాల ర్యాక్ వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థుల్లో పాఠనాసక్తి పెరగాలని హెచ్‌ఎం భవనం భద్రి రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐటీసీ అనుబంధ సంస్థ ఫినిష్ సొసైటీ వారి ఆర్థిక సహకారంతో లైబ్రరీ పుస్తకాల ర్యాక్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసుల రెడ్డి, అనురాధ, అంజమ్మ, వైవీ రమణ పాల్గొన్నారు.

ప్రతి చిన్నారి పాఠశాలలో ఉండాలి

- అడ్మిషన్లు చేసిన తల్లిదండ్రులు



పాఠశాలలో చేరేందుకు అడ్మిషన్ ఇస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి: మండలంలో ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారి పాఠశాలలో ఉండాలని తిమ్మాయపాలెంలోని ఎస్సీ కాలనీలోని పాఠశాల ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. గురువారం కాలనీలో పర్యటించి తల్లిదండ్రులను కలిసి విద్యా బోధన గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిస్తే పిల్లలకు రూ.15 వేలు ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. దాంతో పాటు యూనిఫాం, మెరుగైన ఒత్తిడి లేని విద్యను అందిస్తామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల మోజులో పడవద్దని చెప్పారు. నలుగురు విద్యార్థులకు అడ్మిషన్లు రాయించారు. హెచ్‌ఎం ఎంవీ రమణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టలు సిద్ధం

బల్లికురవ: రైతులు పండిన పంటలను ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్ పట్టలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వెలుగు ఏపీఎం టి. రాజరావు, రైతుమిత్ర దమ్ము అంజయ్య గురువారం తెలిపారు. నలుపు రంగు పట్టలు 18–24 సైజులో రూ. 1850 అంజేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

కచ్చితమైన సమాచారం సేకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనురాధ

ఇంకొల్లు (చినగంజాం): గ్రామ సంఘ ప్రణాళిక, మండల స్థాయి, జిల్లా స్థాయి వార్షిక రుణ ప్రణాళిక కోసం కచ్చితమైన సమాచారం సేకరించాలని కోరారు. ఏపీఎం అనురాధ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, సంఘాల జీవనోపాధుల నిమిత్తం రుణ ప్రణాళిక నిర్వహించనున్నారు. దీని కోసం ఎన్యూమరేటర్లకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఒక్కొక్కరు 5 నుంచి 8 సంఘాలకు సంబంధించిన డేటా సేకరించాలని.. ముందుగా అన్ని గ్రామాల్లో గ్రామ సంఘం సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. క్లస్టర్ సీసీ, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్లను రోడ్డున పడేసే బిల్లు మాకొద్దు

- కేంద్రం తీరుకు వ్యతిరేకంగా నిరసన



నిసరన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చీరాల రూరల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన పెన్షనర్స్ బిల్లు వల్ల తాము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని అటువంటి బిల్లు తమకొద్దంటూ పెన్షనర్స్ ముక్తకంఠంతో నినదించారు. చీరాల హెడ్ పోస్టాఫీసు వద్ద గురువారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ చీరాల అధ్యక్షుడు పి. జగన్మోహనరావు, కాటి మార్కు మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా ఎంతో కష్టపడి నీతి, నిజాయితీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి పదవీవిరమణ చేస్తే ప్రభుత్వం ఈ విధంగా అవమానించడం తగదన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమాస్టర్ నాగేశ్వరరావు, టి. జగన్మోహనరావు, ఎస్‌కే మస్తాన్‌వలి, దేవసహాయం, శ్రీధర్, సాంబశివరావు, జి. శేఖర్‌రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: చీరాల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఫైనాన్స్ బిల్లు 2025 లోక్‌సభలో ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పెన్షనర్లకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువులకు నీటితొట్లు

బల్లికురవ: వేసవి దృష్ట్యా పొలాలకు వెళ్లే పశువులకు నీరందించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 25 నీటి తొట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ కుసుకుమారి గురువారం తెలిపారు. గుంటుపల్లికి 2, కొప్పరపాడుకు 3, ముక్తేశ్వరం 5, మల్లాయపాలెం 2, వైదన 2, బల్లికురవ, గొర్రెపాడు, కూకట్లపల్లి, కొమ్మినేనివారిపాలెం, నక్కబొక్కలపాడు, ఎస్ఎల్ గుడిపాడు, వల్లాపల్లి వేమవరం గ్రామాలకు ఒక్కోటి చొప్పున మంజూరైట్లు వివరించారు. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి రూ. 40 వేలు నిధులు మంజూరయ్యాయని తక్షణమే పనులు చేపట్టి నీరు అందిస్తామన్నారు.